

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్


REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com



జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900



సంపుటి : 4 సంచిక : 301 ఎడిటర్ : నరేష్ సాకే వార సంచిక : 15 - 05 - 2025 పేజీలు : 5


# ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం.. ఢిల్లీకి చంద్రబాబు, పవన్

**- ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 24 ఎన్డీఏ కీలక భేటీ**
**- ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై చర్చించే అవకాశం**
**- ఆపరేషన్ వివరాలను నేతలకు వెల్లడించనున్న ప్రధాని మోదీ**

**ఢిల్లీ, 14 మే, జనస్వరం :** ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి చుక్కలు చూపించిన తర్వాత ఎన్డీఏ కీలక భేటీ కానుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ నెల 25న సమావేశం జరగనుంది. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని ఎన్డీఏ నేతలకు వివరించనున్నట్లు సమాచారం. ఆపరేషన్‌లో ఉగ్రవాద శిబిరాలపై చేసిన దాడుల గురించి వివరించే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతిపక్ష నేతలు సైతం ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించారు. అయితే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడంతో ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్షాల నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాలపై ఎన్డీఏ నేతలకు అవగాహన కల్పించడం ద్వారా విమర్శలను తిప్పికొట్టేలా చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎన్డీఏ కీలక భేటీ జరగనుంది. ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేయనున్నారు. ఈ కీలక భేటీకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం.



# నూతన సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్



**ఢిల్లీ, 14 మే, జనస్వరం :** భారతదేశ నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (బీఆర్ గవాయ్) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నియామకంతో దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 52వ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ గవాయ్ ఈ పదవిని అలంకరించిన తొలి బౌద్ధ మతస్థుడు కావడం, అలాగే షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) నుంచి ఈ స్థాయికి చేరిన రెండో వ్యక్తి కావడం విశేషం. నిబంధనల ప్రకారం, రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక అధికారిక కార్యక్రమంలో రాష్ట్రపతి, జస్టిస్ గవాయ్‌తో భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర న్యాయ ప్రముఖులు, ఉన్నతాధికారులు మరియు జస్టిస్ గవాయ్ కుటుంబ సభ్యులు హాజరైనట్లు సమాచారం. ఈ సందర్భంగా నూతన సీజేఐ బీఆర్ గవాయ్ కి ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. "భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యాను. ఆయన పదవీకాలం అత్యంత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను" అని ప్రధాని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

# రూ. 22వేల కోట్లతో అనంతపురం జిల్లాలో రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

**- దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు 16న మంత్రి లోకేష్ శంకుస్థాపన**
**- ప్రజాప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు**

**అమరావతి, మే 14 (జనస్వరం) :** రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తెచ్చిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (ICE)తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏపికి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ.22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈనెల 16వతేదీన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేష్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో లోకేష్ ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది. రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యంగల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై మొత్తంగా 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ గా ఆవిర్భవించడమే గాక ఎపి క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఎపి పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న పీపీఏలన్నింటినీ జగన్ ప్రభుత్వం ఏకపక్షంగా రద్దుచేసింది. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం జీరోస్థాయికి పడిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గత ఏడాది అక్టోబర్ లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేష్ రెన్యూ పవర్ ఛైర్మన్ కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి నారా లోకేష్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.65వేలకోట్లతో 500 సిబిజి ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు రాగా, కనిగిరిలో తొలిప్లాంట్ కు మంత్రి లోకేష్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేలకోట్ల పెట్టుబడి), ఎన్టిపిసి గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ.50వేల కోట్లు), ఎస్ఎఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయేరోజుల్లో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.



# రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల సమావేశం



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాధిపతులు భేటీ అయ్యారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సమర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు.

**ఈ భేటీపై రాష్ట్రపతి భవన్ ట్వీట్ :**

"రక్షణ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావికా దళాల అధిపతి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారతదేశం యొక్క ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు" అని రాష్ట్రపతి భవన్ తన ట్వీట్‌లో పేర్కొంది.

# సింధూ జలాలపై కాళ్ల బేరానికి పాకిస్థాన్!

సింధూ నదీ జలాల ఒప్పందం విషయంలో ఇదివరకు దూకుడుగా వ్యవహరించిన పాకిస్థాన్ వైఖరిలో మార్పు వచ్చినట్లు కనిపిస్తోంది. ఒప్పందాన్ని నిలిపివేస్తే ఎదురయ్యే తీవ్ర పరిణామాలను గ్రహించిన ఆ దేశం, ఈ అంశంపై తన నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని భారత్‌ను అభ్యర్థించింది. సింధూ జలాల విషయంలో తగ్గేది లేదని భారత్ పదేపదే తేల్చి చెప్పడంతో పాకిస్థాన్ తానే వెనక్కి తగ్గింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూ నదీ జలాలను భారత్ నిలిపివేస్తే తమ దేశంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేస్తూ పాకిస్థాన్ జలవనరుల మంత్రిత్వ శాఖ, భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు ఒక లేఖ రాసినట్లు సమాచారం. ఈ సున్నితమైన అంశంపై చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆ లేఖలో పేర్కొంది. నిబంధనల ప్రకారం, ఈ లేఖను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది.



## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

**తేదీ : 15 మే 2025**
**తిథి : శుద్ధి విదియ ( మ : 2.01 వరకు )**
**నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )**
**బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు**
**రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు**
**యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు**
**వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు**

## ఈరోజు నమాజ్ వేళలు

**తేదీ : 15 మే 2025**
**ఫజర్ : 5.35 ఉదయం**
**సూర్యోదయం : 6.48 ఉదయం**
**జొహర్ : 12.34 మధ్యాహ్నం**
**అసర్ : 3.52 సాయంత్రం**
**మఘ్రిబ్ : 6.19 సాయంత్రం**
**ఇషా : 7.32 సాయంత్రం**


జనస్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా





# మోదీ ఎంత ఎంత పెరిగిందో తెలుసా?

## ఎడిటోరియల్

**- రాత్రికి రాత్రి గ్రాఫ్**

ఆపరేషన్ సిందూర్ తో పాక్ కు జరిగిన నష్టం గురించి మనకు తెలియదు. నష్టమయితే జరిగింది. అలాగే ఉగ్రవాదులకు కూడా భారీ నష్టం జరిగిందని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. కానీ సిందూర్ మాత్రం మోదీ ఇమేజ్ గ్రాఫ్ దేశంలోనే కాదు ప్రపంచంలోనే ఒక్కసారిగా పెరిగిందన్నది అందరూ ఒప్పుకునే వాస్తవం. ఆపరేషన్ సిందూర్ తో ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో శక్తిమంతమైన నేతగా ఆవిర్భవించారు. ఎందుకంటే ప్రత్యర్థులు విమర్శించవచ్చు. ఎన్నికలకు ముందు యుద్ధం అంటూ హడావిడి చేసి సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం అనే వాళ్లకు కూడా మోదీ సమాధానం ధీటుగా చెప్పారు. ఇప్పుడిప్పుడే ఎన్నికలు లేవు. అయినా ఈ ఉద్రిక్తతలు భారత్ కొని తెచ్చుకుంది కాదు. పహాల్గామ్ లో ఉగ్రవాదులు దాడి చేసి ఇరవై ఆరు మంది అమాయకులను పొట్టన పెట్టుకోవడంతో భారత్ రగలిపోయింది.

**కన్నెత్తి చూడకుండా.. :**

ప్రతి భారతీయుడు పాక్ పై కసి తీర్చుకోవాలని కోరుకున్నాడు. కానీ పాక్ కానీ, ఉగ్రవాదులు కానీ తక్కువ అంచనా వేశారు. అక్కడ ఉన్నది మోదీ. ప్లాన్ చేశాడంటే ఇక తిరుగుండదు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఎలాంటి చర్చ నడుస్తుందంటే.. భారత్ - పాక్ ల మధ్య యుద్ధం కాదిది. తీవ్రవాదులు వర్సెస్ మోదీ మధ్యనే అన్నది అందరికీ అర్థమయ్యేలా చెప్పగలిగారు. దీంతో పాటు భారత సత్తాను అంతర్జాతీయ సమాజం ముందు మోదీ ఉంచగలిగారు. మరొకరు భారత్ పై కన్నెత్తకుండా ఈ ఒక్క ప్రయత్నంతో చేశారు. భారత్ కు జరిగిన నష్టం స్వల్పమే. కానీ పాక్ మాత్రం ఉగ్రవాదులను ప్రోత్సహించి ఈరోజు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఇటు టెర్రరిస్టుల గ్యాంగ్ కూడా వంద మందికి పైగానే హతమయ్యారంటున్నారు.

**ఉగ్రవాదులకు కోలుకోలేని దెబ్బ... :**

ఇది నిజంగా మోదీ టెర్రరిస్టులను కోలుకోలేని విధంగా దెబ్బతీసినట్లే. మన భూభాగం పై నుంచి తొమ్మిది ఉగ్రవాద మూకల స్థావరాలను నాశనం చేయగలిగారంటే ఎంత పకడ్బందీగా ప్లాన్ చేశారో అర్థమవుతుంది. కేవలం పదిహేను రోజుల్లోనే ఉగ్రవాదులు వారికి అండగా నిలుస్తున్న పాక్ కు గుణపాఠం మోదీ చెప్పగలిగారు.



ఉగ్రవాదులు కూడా భారత్ ఆర్మీపైన ఆగ్రహంగా లేరు. కేవలం మోదీనే లక్ష్యంగా చేసుకునే అవకాశముందన్న వార్తలు వస్తున్నాయి. కరడు గట్టిన తీవ్రవాది జైషే మహ్మద్ మసూద్ అజహర్ సైతం మోదీపై విషం కక్కే ప్రయత్నం చేశాడు. ఈ దాడుల్లో మసూద్ కుటుంబ సభ్యులను దాదాపు పధ్నాలుగు మందిని కోల్పోయారు. సహచర ఉగ్రవాదులు హతమయ్యారు.

**మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం :**

గతంలో పాక్ పై యుద్ధం ప్రకటించిన ఇందిర గాంధీ ఐరన్ లేడీగా నిలిచారు. నేడు మోదీ కూడా పాక్ పీచమణచడానికి వేసిన ప్లాన్ సక్సెస్ అయిందనే చెప్పాలి. "ఆపరేషన్ సిందూర్" అని పేరు పెట్టడం నుంచి మహిళ అధికారుల చేత మీడియా సమావేశం పెట్టి దాడులపై బ్రీఫింగ్ ఇప్పించడం దగ్గర నుంచి మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం హైలెట్ అయిందనే చెప్పాలి. ప్రతి భారతీయుడు మరచిపోలేని విధంగా మోదీ వ్యవహరించారని సోషల్ మీడియాలో మారుమోగిపోతుంది. ఎన్నికల కోసం కాదు కానీ.. మోదీ ఉంటే భరోసా ఉంటుందన్న నమ్మకాన్ని అందరిలో కలిగించారు. విమర్శకుల నోళ్లు సైతం మూయించగలిగారు. అందుకే ఆపరేషన్ సింధూర్ లాభనష్టాలపై అంచనాలకంటే మోదీ ఇమేజ్ మాత్రం అమాంతం పెరిగిందన్నది విశ్లేషకులు సైతం అంగీకరిస్తున్న విషయం. కాల్పుల విరమణ తర్వాత మోదీ ఇమేజ్ పడిపోయిందని కొందరు అంటున్నప్పటికీ.. యుద్ధం అన్నింటికీ సమాధానం కాదని, పహాల్గామ్ పై దాడికి ప్రతీకారం తీర్చుకోగలిగామన్న కామెంట్స్ మాత్రం వినపడుతున్నాయి.

## ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్

**విజయవాడ, మే 14 (జనస్వరం) :** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లోని పార్లమెంట్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అలాగే, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు తెలుపుతూ ఓ ప్రత్యేకమైన కొండపల్లి బొమ్మను బహుకరించారు. తనపై చూపిన అభినందనలకు కె.ఎస్. జవహర్ కేశినేని శివనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బాబురావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు అశీష్ లాల్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవినేని చందు, గంపలగూడెం మండల మాజీ అధ్యక్షుడు జానకీ రామ్ తదితరులు పాల్గొన్నారు.




## ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపి ఈశ్వర్

**విజయవాడ, మే 14 (జనస్వరం) :** కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పెరిపి ఈశ్వర్ బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లను విజయవాడలోని ఎన్టీఆర్ భవన్ పార్లమెంట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లు పెరిపి ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో సత్కరించి శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహుకరించారు. తనపై నమ్మకంతో చైర్మన్ పదవిని అప్పగించినందుకు ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌లకు పెరిపి ఈశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న), టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవినేని చందు పాల్గొన్నారు.



## ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొటికలపూడి టీడీపీ నూతన కార్యవర్గం

**విజయవాడ, మే 14 (జనస్వరం) :** మైలవరం నియోజకవర్గంలోని ఇబ్రాహీంపట్నం మండలానికి చెందిన కొటికలపూడి గ్రామం టీడీపీ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్ పార్లమెంట్ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నిని) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడిగా ఎంపికైన అర్జా సుధాకర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించి శాలువా కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యక్షుడిగా కొలాకాని తిరుపతి రావు, సెక్రటరీగా గంద్రాల కిషోర్ తదితరులు నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులందరూ తమకు పార్టీ నాయకత్వం ఇచ్చిన బాధ్యతను న్యాయంగా నెరవేరుస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని ఎంపీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ అధ్యక్షుడు మల్లేటి రామారావు, వైస్ ఎంపీపీ బండి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీర్ల వెంకయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ కేశినేని చిన్నిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

**విజయవాడ, మే 14 (జనస్వరం) :** ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా తాజాగా నియమితులైన సీనియర్ జర్నలిస్టు, రచయిత ఆలపాటి సురేష్ కుమార్ బుధవారం విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని)ను మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని గురునానక్ కాలనీలో ఉన్న ఎన్టీఆర్ భవన్‌లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. బుద్ధుడి విగ్రహాన్ని బహుకరిస్తూ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలపాటి సురేష్ తనకు అభినందనలు తెలిపిన ఎంపీ శివనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, యువ నాయకుడు దేవినేని చందు పాల్గొన్నారు.



## ప్రజల అర్జీలకు న్యాయమే లక్ష్యంగా టీడీపీ నేతల స్పందన

**మంగళగిరి, మే 14 (జనస్వరం) :** సమస్యలు ఎదురైన సామాన్య ప్రజలు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతి స్వీకరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ తమ సమస్యలపై పార్టీ నాయకులకు ఫిర్యాదు చేస్తూ న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి వారు కృషి చేశారు. తన ఇంటిని అక్రమంగా ఆక్రమించుకున్నారని, పోలీసు అధికారుల సహకారంతో సగం అర్జీ రాసి ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారని, గ్రామ సర్పంచ్‌తో సహా మరికొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని తోట వెంకట శ్రీనివాసరావు అనే వ్యక్తి వాపోయారు. ఆయన కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం తుంగలవారిపాలెం గ్రామానికి చెందినవారు. నేతల ముందు తన సమస్యను వివరించి న్యాయం చేయాలని కోరారు. ఇక విశాఖపట్నం జిల్లాలో 2016–17 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు మండలాల్లో విద్యార్థుల యూనిఫాం కుట్టిన కూలీకి సంబంధించిన రూ. 18,90,208 బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని హుసేన్ బాషా విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం జిల్లాలోని వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యామాక అప్పల నాయుడు, 2017–18లో నరేగా పథకం కింద చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలంటూ అర్జీ ఇచ్చారు. తోట రామారావు అనే వ్యక్తి తన ఆస్తిపై చేసిన ఫిర్యాదుకు విచారణ లేకుండానే విత్‌డ్రా చేయమంటూ బెదిరింపులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ అధికారులు ఎలాంటి స్పందన ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన వేల్పుల జేమ్స్ వెంకయ్య, తనకు తండ్రి ద్వారా వచ్చిన భూములు సర్వే చేసి హద్దులు చూపించాలని, భూముల్లోకి సంబంధం లేని వ్యక్తులు ప్రవేశించి బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం తూర్పు కట్టక్రిందపల్లి గ్రామానికి చెందిన అల్ల వెంకటేశ్వర్లు, అర్థాంతరంగా నిలిచిపోయిన గ్రామ సచివాలయాన్ని పూర్తిచేయాలని, ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద గ్రామానికి త్రాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కడప నగరంలోని 45వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన చంద్రగిరి నారాయణ, అక్కడ ఉన్న గుడి స్థలాన్ని వైసీపీ వ్యక్తులు ఆక్రమించి



అమ్మాలని చూస్తున్నారని, తక్షణమే అధికారుల ద్వారా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పాచిపెంట జూనియర్ కళాశాలలో ప్రైమరీ మినిమం టైమ్ స్కేల్ కింద పనిచేస్తున్న పి. ఈశ్వర్ రావు, గత 15 నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తక్షణమే జీతాలు చెల్లించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ విధంగా ప్రజల సమస్యలు ఆలకించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తూ టీడీపీ నాయకులు అందరికీ ఆత్మవిశ్వాసాన్ని నూరిపోస్తున్నారు. ప్రజల ఆకాంక్షలపై స్పందిస్తూ న్యాయాన్ని అందించేందుకు ముందుండటం విశేషంగా అభినందనీయమైంది.

## పండుగ వాతావరణంలో టీడీపీ మహానాడు నిర్వహణ

**- ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు**
**- కడపలో మహానాడు ఏర్పాట్లపై మంత్రులు, సీనియర్ నేతలతో మంత్రి నారా లోకేష్ సమావేశం**

**మంగళగిరి, మే 14 (జనస్వరం) :** కడపలో పండుగ వాతావరణంలో టీడీపీ మహానాడును నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం నిర్వహించారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "అన్న ఎన్టీఆర్ దగ్గర నుంచి పండుగ వాతావరణంలో మహానాడును నిర్వహించడం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. వసతి, రవాణకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి" అని నేతలకు దిశానిర్దేశం చేశారు. మూడు రోజుల పాటు మహానాడు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మొదటి రోజు తెలుగుదేశం పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలపై చర్చ జరగనుంది. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎస్.సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు



బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేల జ్యోతుల నెహ్రూ, ఆర్. మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

**పులివెందుల మే 14 (జనస్వరం) :** ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు గఫార్ విజ్ఞప్తి చేశారు. ఈ అంశానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. బ్రిటిష్ వాడితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోడీ ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ల వల్ల కార్పొరేట్ల లాభాలు పెరిగి,కార్మికులు ఏ హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.3 నల్ల చట్టలతో రైతులను,4 లేబర్ కోడ్లలో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోడీ మతోన్మాద ఎజెండాను అమలుపరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటుందని విమర్శించారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక ప్రజావ్యతిరేక రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, పోస్టల్, బిఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు అందరూ కూడా సమ్మెను బలపరచడం ద్వారా మోడీ కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు



నాయకులు విశ్వనాథ్, హరి శివయ్య, రామాంజనేయులు, బాబా ఫక్రుద్దీన్, అశోక్ కుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జనస్వరం www.janaswaram.com తెలంగాణ

# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

## - బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర సదస్సు పిలుపు

**శేరిలింగంపల్లి, మే 14 (జనస్వరం) :** మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్ లింగంపల్లి ఓంకార్ భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బీఎల్‌టియు ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధి రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏఐసిటియు రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్ మాట్లాడుతూ, భారత బహుజన కార్మిక వర్గానికి రాజ్యాంగం కల్పించిన 44 రక్షణ చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు కోడ్‌లను తీసుకొచ్చిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం, అంబానీ, అదానీ లాంటి స్వదేశీ మరియు విదేశీ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసమే ఈ చర్యలు చేపట్టిందన్నారు. కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కనీస వేతనాలు మరియు ఉద్యోగ భద్రత కల్పించే కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మే 20న జరగబోయే దేశవ్యాప్త సమ్మెలో బహుజన కార్మిక వర్గం భారీగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సదస్సులో ఏఐసిటియు రాష్ట్ర నాయకులు కర్ర దానయ్య, జి. శివాని, బీఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, కె హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె. చంద్రశేఖర్ ప్రసాద్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు డి. రాజేష్, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు మల్లేష్, యకయ్య, టీఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాలీల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు యదగిరి, టీఎస్‌కేపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్తెలరం, జంగయ్య, రాష్ట్ర నాయకులు గ్యార సాలయ్య, ఎస్. ప్రభాకర్, ఖెచ్‌పిఎస్ రాష్ట్ర నాయకులు ఎం. వెంకటయ్య, టీవీవీయు వ్యవసాయ వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డోలక్ యాదగిరి, పీవీకేవీ రాష్ట్ర నాయకులు శేక్ శావాలి, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు సునీత, ప్రగతిశీల మహిళల సంఘం రాష్ట్ర నాయకురాలు మేకల రాజేందర్, గంగా శంకర్, బహుజన మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి. జగదీష్, ఎస్.డి. సైయ్యద్, బహుళ జన బీడీ కార్మిక



రాష్ట్ర నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. కళాకారులు తమ పాటల ద్వారా కార్మికులకు ఉత్తేజం కల్పించారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర రక్షణ చట్టాలను రూపొందించాలని, బీజేపీ తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాన్ని రూ.30,000కి పెంచాలని, ఈపీఎఫ్ పెన్షన్ రూ.15,000 ఇవ్వాలని, బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్‌టీ మరియు కోప్టా చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ శాలల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

# అరటి రైతులను ఆదుకుంటాం : బీజేపీ

**పులివెందుల మే 14 (జనస్వరం) :** ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న ప్రతి అరటి రైతును అనుకుంటామని బీజేపీ నాయకులు కేతిరెడ్డి తిరుపాల్ రెడ్డి, ఉపేంద్ర రెడ్డి, గంగిరెడ్డి, శ్రీరాములు, శివ లు తెలిపారు. పులివెందుల మండలం ఈ కొత్తపల్లి గ్రామ పరిధిలో దెబ్బతిన్న అరటి తోటలను బుధవారం వారు పరిశీలించారు. సాగుకు వెచ్చించిన పెట్టుబడి తదితర అంశాలను వారు రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవిలో పెనుగాలులు రావడం సహజమేనన్నారు. పులివెందుల ప్రాంతంలో ఇప్పటివరకు మూడు పర్యాయాలు పెనుగాలులు సంభవించాయన్నారు. సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు ఈ కొత్తపల్లి ప్రాంతంలో భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఇందులో బాల వీరాంజనేయులు కు చెందిన సుమారు మూడు వేల అరటి చెట్లు నేల కొరిగాయన్నారు. దిగుబడి చేతికందే దశలో అరటి రైతులపై ప్రకృతి కన్నెర్ర చేయడం బాధిస్తోందన్నారు. దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఇప్పటికే హెక్టారుకు 30000 రూపాయల చొప్పున పరిహారం అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది అన్నారు. దెబ్బతిన్న రైతులకు పరిహారంతో పాటు ప్రత్యామ్నాయ వసతులు కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. పరిహారం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఆ మేరకు రైతులకు హామీ ఇచ్చినట్లు వారు స్పష్టం చేశారు.



# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు...

**నంద్యాల, మే 14 (జన స్వరం) :** జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సంజీవనగర్‌లోని రామకృష్ణ విద్యాలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 11 సంవత్సరాల లోపు బాల బాలికల కోసం జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జిల్లా క్రీడా ప్రాదేశిక అధికారి నరసింహారాజు అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా అధికారి నరసింహారాజు మాట్లాడుతూ, గెలిచిన వారు తమ స్థాయిని నిలబెట్టుకోవాలని, విజయం సాధించని వారు భావి పోటీలకు క్రీడా స్ఫూర్తితో మరింత కృషి చేయాలని సూచించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ, కోచ్‌ల పర్యవేక్షణలో ప్రతిరోజూ సాధన చేస్తే చదరంగం వంటి క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. క్రీడాకారులలో అంకితభావం, క్రమశిక్షణ చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ స్కూల్ కరస్పాండెంట్ మునిశేఖర్, జిల్లా క్రీడాభారతి కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్, చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆర్బిటర్ సుజాత పాల్గొన్నారు. 11 సంవత్సరాల లోపు ఓపెన్ విభాగంలో మన్విత్ నాయక్ తొలి స్థానం, శివ కార్తికేయ రెండవ స్థానం సాధించగా, బాలికల విభాగంలో రిషిత బాయి తొలి స్థానం, సాయి తేజస్ రెండవ స్థానం సాధించి ట్రోఫీలు




అందుకున్నారు. ఈ విజేతలు నరసరావుపేటలో మే 24, 25 తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు.

# కన్నుల పండగగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కళ్యాణం

**కోవూరు, మే 14 (జనస్వరం) :** కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు గ్రామంలో జరిగిన శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులచే తీర్థ ప్రసాదాలను స్వీకరించారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు దంపతులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె ఇంటూరు దంపతులతో కలిసి వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. కార్యక్రమంలో కందుకూరి అన్న బెంగళూరు నాగేశ్వరరావు, ఫౌండర్ ట్రస్ట్ సుదీష్ చంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కళా జాతర : ఇంద్ర ప్రియాంక

చింతపల్లి, మే 14 (జనస్వరం) : ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేకంగా కళా జాతర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ నాగ సాయి కళాబృందం ఆధ్వర్యంలో, ప్రాంతీయ ఆసుపత్రి ఐసిటిసి ల్యాబ్ టెక్నీషియన్ నెల్లి గోవింద్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ఇంద్ర ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లైంగిక సంబంధాలకు లోనయ్యే వారు తప్పనిసరిగా నిరోధకాలు ఉపయోగించాలని, ముందస్తు జాగ్రత్తల ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని సూచించారు కళాబృందం ప్రదర్శించిన సందేశాత్మక పాటలు, నాటికలు, నృత్యాలు హాజరైనవారిని ఆకట్టుకున్నాయి. ప్రజల్లో చైతన్యం కలిగించడంలో ఈ ప్రదర్శనలు కీలక పాత్ర పోషించాయి. అధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ పద్ధతులు, పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు లోసరి లక్ష్మమ్మ, పెంట కుమారి, హెల్త్ అసిస్టెంట్ సత్యరావు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మల్లెపువ్వులా మెరిసే మిరపకాయలు...!

**చింతపల్లి, మే 14 (జనస్వరం) :** మల్లెపువ్వులను తలపించే ఆకారంతో ఆకట్టుకుంటున్న ఈ తెల్లటి మిరపకాయలు ఇప్పుడు చింతపల్లిలో సంచలనంగా మారాయి. మండల కేంద్రానికి చెందిన ప్రజాశక్తి విలేఖరి ఇందుగ అచ్యుత్ రామయ్య పెరటిలో పెరిగిన ఈ అరుదైన పచ్చిమిర్చి చెట్టు చూసినవారిని ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. సాధారణంగా మిరపకాయలు పచ్చగా లేదా ఎర్రగా ఉండే వివరణకు భిన్నంగా, ఈ మొక్కపై మొలకెత్తిన మిరపకాయలు తెల్లటి మల్లెపువ్వులను తలపించేలా ఉన్నాయి. వాటి ఆకారం, రంగు, మరియు ముల్లల మీద కూర్చున్న తీరు కూడా పువ్వుల్ని గుర్తు చేస్తుండటంతో స్థానికుల మధ్య విశేష ఆసక్తి నెలకొంది. ఈ రకమైన మిరపకాయలు సహజంగా వచ్చే తరం తేజస్వి మిరపకాయలలో ఒకటేనా, లేక నూతనంగా అభివృద్ధి చేసిన విత్తనాల వల్ల రూపుదిద్దుకున్న



కొత్త జాతియా? అనే సందేహాలకు నిపుణుల పరిశీలన అవసరం. ఇందుగ అచ్యుత్ రామయ్య పెరటిలోని ఈ ప్రత్యేక మిరపచెట్టు ప్రస్తుతం చింతపల్లి వాసుల్లో సంచలన చర్చనీయాంశంగా మారింది.



# గ్రంథాలయాల్లో విద్యతో పాటు వినోదం

**పెదపాడు, మే 14 (జనస్వరం) :** గ్రంథాలయాలు విద్యార్థులకు విద్యతో పాటు వినోదాన్ని కూడా అందిస్తాయని, విద్యార్థులందరూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెదపాడు గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్ బాబు సూచించారు.



పెదపాడు శాఖా గ్రంథాలయం నందు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ శ్రీమతి దత్తి రేణుక ఎల్లమ్మ "బమ్మెర పోతన" జీవిత చరిత్రను విపులంగా వివరించారు. మందార మకరంద మాధుర్యంతో ఆకట్టుకునే ఆంధ్ర మహాభారతాన్ని రచించిన బమ్మెర పోతన గారు అచ్చమైన తెలుగు కవి, స్వచ్ఛమైన సహజ కవి అని ఆమె వివరించారు. అనంతరం కే. రాజేశ్వరరావు రచించిన "చిట్టి రాజు – గూని గుర్రం" అనే కథను విద్యార్థులచే చదివించారు. పుస్తక పఠనం కూడా చేయించారు. తరువాత ఆటవిడుపు కార్యక్రమంగా బాలబాలికలకు కోకో ఆట నేర్పించి ఆడించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 31 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.

# గ్యాస్ లీక్‌తో మంటలు–సర్వనాశనమైన ఇంటి సామగ్రి

**చింతపల్లి, మే 14 (జనస్వరం) :** మండలంలోని లోతుగడ్డ పంచాయితీ చెరుకుంపాకల గ్రామంలో బుధవారం దుర్మర దుర్ఘటన చోటుచేసుకుంది. గ్యాస్ లీక్ వల్ల ఒక్కసారిగా మంటలు చెలరేగి ఓ కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేలు విలువైన ఇంటి వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికంగా బట్టల వ్యాపారిగా వ్యవహరిస్తున్న సుధ కృష్ణ, ఆయన భార్య లక్ష్మి పార్వతి కుట్టు మిషన్ ద్వారా జీవనాధారాన్ని సాగిస్తున్నారు. బుధవారం ఈ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి వంట తయారీ అనంతరం శివాలయ దర్శనానికి వెళ్లారు. అప్పటికే వంట పనుల్లో సాయం చేసేందుకు వచ్చిన సుధ కృష్ణ వదిన సంగా గీత ఇంటి వరండాలో వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు పక్కన ఉన్న బట్టలకు అంటుకోవడంతో గీత అప్రమత్తమై బయటకు పరుగెత్తి ప్రాణాలను రక్షించుకుంది. అయితే, అప్పటికే మంటలు ఇంట్లోని ఇతర వస్తువులను చుట్టుముట్టాయి. ఫర్నిచర్, కరెంట్ వైరింగ్, బట్టలు, కుట్టు యంత్రాలు సహా అనేక మౌలిక అవసరాల వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు తక్షణమే స్పందించి మంటలను అదుపుచేయడానికి యత్నించినప్పటికీ అప్పటికే ఇంటి అంతా మంటల్లో కరిగిపోయింది. ఈ ఘటనలో సంగా గీతకు స్వల్ప గాయాలైనట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదం కారణంగా తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిన కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# దేశరక్షకుల మాతృ మూర్తులకు సాత్కారాలు

## - ఇళ్లపై జాతీయజండా ఎగురవేయాలి

**యలమంచిలి మే 14 జనస్వరం :** ఉగ్రవాదాన్ని వ్యతిరేకస్తూ భారత్ సరిహద్దుల్లో చేస్తున్న పోరాటంలో పాల్గొన్న ఆర్మీ సైనికుల కుటుంబాలకు మనోధైర్యం నింపేందుకు యలమంచిలి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చైర్పర్సన్ రమాకుమారి ప్రజల భాగస్వామ్యంతో ప్రతి సైనికుడు ఇంటి పైన జాతీయ జెండా ఎగరవేసి తల్లిదండ్రులను కలిసి వారిని సత్కరించి మనోధైర్యం చెప్పేందుకు జై భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్ పర్సన్ రమాకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశరక్షణ కోసం నిద్రాహారాలు మాని మనందరి కోసం పాకిస్తాన్తో పోరాడుతున్న సైనిక్ కుటుంబాలను కలిసి మనోధైర్యం నింపేందుకు జై భారత్ కార్యక్రమం ద్వారా శనివారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ద్వారా జాతీయ సైనిక కుటుంబాలను కలిసి వారి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి వారి తల్లిదండ్రులను సత్కరించి వారి ఆనందంపజేయడం జరుగుతుందని రమాకుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వ్యాపార సంఘాలు విశ్రాంతి దేశ రక్షకులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రమాకుమారి కోరారు.



# గ్రంథాలయాలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తాయి

**దెందులూరు, మే 14 (జనస్వరం) :** గ్రంథాలయాలు విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తాయని పోతునూరు గ్రంథ పాలకులు గురిందపల్లి రాంబాబు అన్నారు. పోతునూరు శాఖా గ్రంథాలయంలో వేసవి



విజ్ఞాన శిక్షణ శిబిరము 13వ రోజు లో భాగంగా వివిధ స్కూల్స్ నుంచి 18 మంది విద్యార్థిని విద్యార్థులు వచ్చారు. మొదటగా చదివించడం తర్వాత నీతి కథలు చెప్పించడం పద్యాలు చెప్పించడం క్యారం బోర్డ్ ఆడించారు. తదుపరి రిసోర్స్ పర్సన్ సందీప్ కుమార్ వారి పర్యవేక్షణలో జీకే ,క్విజ్ పోటీలు మరియు స్పోకెన్ ఇంగ్లీష్ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి గురిందపల్లి రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి.

## ఆలయాల కూల్చివేతలపై నిరసనకు... ఇప్పటికీ కోర్టు కేసులు!

**మదనపల్లె, మే 14 (జనస్వరం) :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల కూల్చివేతలు, దేవతా విగ్రహాల ధ్వంసం జరిగిన సమయంలో, వాటిని తీవ్రంగా ఖండిస్తూ జనసేన, భాజపా పార్టీలు ఉమ్మడిగా చేపట్టిన నిరసనలు, ధర్నాలపై అప్పటి ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేసింది. 2019లో నమోదైన ఈ కేసుల వల్ల ఇప్పటికీ ప్రతీ నెల కోర్టుకు హాజరయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మదనపల్లె జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో కోర్టు వాయిదాకు హాజరైన వారిలో జనసేన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత, భాజపా నాయకులు ప్రశాంత్, నరేంద్ర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బాల సుబ్రహ్మణ్యం, ఓసూరి కిరణ్, వసంత కుమార్, కిరణ్, డాక్టర్ సుబ్బారెడ్డి ఉన్నారు. న్యాయం కోసం పోరాడిన నేతలపై ఇలాంటి కేసులు పెట్టడం దుర్మార్గమని, ప్రజా హక్కుల కోసం నిర్భయంగా నిలిచినందుకే ఎదురవుతున్న బాధలని వారు పేర్కొన్నారు. ఆలయాల పరిరక్షణ కోసం చేసిన పోరాటం ఎప్పటికీ ఆరిపోదని, ఇది న్యాయంగా చరిత్రలో నిలిచిపోతుందని వారు తెలిపారు.




## కడప మేయర్ సురేశ్ బాబుపై అనర్హత వేటు



**పులివెందుల మే 14 (జనస్వరం) :** వైసీపీ నేత, కడప మేయర్ సురేశ్ బాబుపై అనర్హత వేటు పడింది. ఆయన్ను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కుటుంబసభ్యులకు కాంట్రాక్టులను అప్పగించి ఆయన మున్సిపల్ చట్టాన్ని ఉల్లంఘించినట్లు పేర్కొంది. మార్చి 28న షోకాజ్ నోటీస్ పంపిన ప్రభుత్వం ఆయన ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోవడంతో అనర్హత వేటు వేసింది. సురేశ్ బాబు రూ.36 లక్షల అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

## వడగాల్పులపై అవగాహన అవసరం



**పులివెందుల, మే 14 (జనస్వరం) :** వేసవిలో వడగాల్పులపై అవగాహన ఎంతో అవసరమని డాక్టర్ షఫీ నిషా బేగం పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గం వేంపల్లి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ మార్పుల ఫలితంగా ప్రపంచ ఉష్ణోగ్రతలు, వేడి గాలుల ప్రభావం అధికంగా ఉండుట వలన, మానవ ఆరోగ్యం మీద దుష్ఫలితాలు అధికంగా ఉంటాయి. ఈ వేడి గాలుల వలన శరీరంపై ఒత్తిడి పెరిగి శ్వాసకోశ, హృదయ సంబంధిత వ్యాధులు, మధుమేహం, మూత్రపిండాల వ్యాధుల ప్రమాదాలు అధికంగా ఉంటాయన్నారు. .కొన్ని సందర్భాలలో ఈ సమస్యలు ప్రాణాంతకంగా మారుతాయని, కావున ప్రతి ఒక్కరు అధిక మోతాదులో కనీసము మూడు నుండి ఐదు లీటర్ల నీటిని త్రాగడం, తెల్లని దుస్తులు ధరించడం, ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటిలో నివాసం చేయడం, హీట్ స్ట్రోక్స్ వచ్చినప్పుడు ప్రాథమిక చికిత్స పట్ల అవగాహన కలిగి ఉండడం మనందరి బాధ్యతన్నారు. అవసరమైన సమయంలో ఓఆర్ఎస్ పాకెట్స్ ను నీటిలో కలుపుకొని తాగడం మేలుకరంగా ఉంటుంది. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరంలో వేంపల్లి లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా విద్యార్థులతో పాటు సమీప గ్రామాల వారికి ఈ విషయాల మీద అవగాహన కలిగించవలసిన బాధ్యత మీ అందరి మీద ఉందన్నారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ పాకెట్స్ ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా బత్తుల జానకిరాం నియామకం



**నకరికల్లు, మే 14, జనస్వరం :** టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా బత్తుల జానకిరాం గారిని నియమించడాన్ని జనసేన పార్టీ తరపున హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు జనసేన పార్టీ నకరికల్లు మండల వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ నాగూర్ వలి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, ప్రజాసేవకు కొత్త అధ్యక్షుడు చొరవ చూపుతారని ఆశిస్తున్నామని, పార్టీలకతీతంగా ప్రజల అభ్యున్నతికి కలిసి పనిచేసేందుకు సిద్ధమని తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాలు



**బొంరాస్ పేట, మే 14 (జనస్వరం) :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐకెపి, పిఎసిఎస్, డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వము వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించింది. ఇప్పటివరకు పలు కొనుగోలు కేంద్రాల్లో వారి ధాన్యం సకాలంలో తూకం వేయకపోవడంతో రైతులు హరిగోశ పడుతున్నారు. మరికొన్నిచోట్ల వరి ధాన్యము కొనుగోలు చేసిన ఇప్పటివరకు డబ్బులు పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.పలు కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వం నిర్వహించిన 41 కేజిల తూకం కాకుండా 42 కేజీల తూకం వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

**నంద్యాల, మే 14 (జనస్వరం) :** జిల్లా చెస్ సంఘం నిర్వహణలో సంజీవ నగర్ లో ఉన్న రామకృష్ణ విద్యాలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 11 సంవత్సరాల లోపు బాల బాలికలుకు జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీలలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, జిల్లా క్రీడా ప్రాదేశిక అధికారి నరసింహారాజు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడా అధికారి నరసింహ రాజు మాట్లాడుతూ గెలిచిన వారు తమ గెలుపు స్థానాన్ని నిలబెట్టుకోవడానికి, విజయం అందుకోని వారు తదుపరి పోటీలలో విజయాలు సాధించడానికి క్రీడా స్ఫూర్తితో కృషి చేయాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ కోచ్ ల పర్యవేక్షణలో నిత్య సాధన చేయడం ద్వారా క్రీడలలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.అంకితభావం, క్రమశిక్షణ క్రీడాకారులకు చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ మునిశేఖర్, జిల్లా క్రీడాభారతి కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ ,జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఆర్బిటర్ సుజాత పాల్గొన్నారు.

**రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విజేతలు :**

11 సంవత్సరాల లోపు ఓపెన్ విభాగంలో మొదటి స్థానం మన్విత్ నాయక్ ,రెండవ స్థానం శివ కార్తికేయ సాధించగా,బాలికల విభాగంలో మొదటి స్థానం రిషిత బాయి,రెండవ స్థానం సాయి తేజస్ విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 24 ,25 తేదీలలో నరసరావుపేటలో జరగబోవు రాష్ట్రస్థాయి 11 సంవత్సరాల లోపు ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు.




# జనసేన సభ్యులకు క్రియాశీలక సభ్యత్వ కార్డుల పంపిణీ

**నంద్యాల, మే 14 (జనస్వరం) :** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు క్రియాశీలక సభ్యత్వ కార్డులు, కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మల్లయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న జనసైనికులకు ప్రమాద రూపంలో గాయపడిన రూ.50 వేల బీమా, ప్రమాదంలో మరణించిన రూ.5 లక్షల బీమాను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కల్పించారని తెలిపారు. 2025 సంవత్సరంగాను జూన్ నెలలో సభ్యత్వ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అభిమానులు, జనసేన కార్యకర్తలు జనసేన పార్టీ సభ్యుడిగా చేరి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఆళ్ళగడ్డ నియోజవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకొని మరణించిన 5 మంది జనసేన కార్యకర్తల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున భీమాను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్లు తెలియజేశారు. 2024 సంవత్సరం గాను సభ్యత్వాలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఆళ్లగడ్డ నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన వాలంటరీలకు, సభ్యత్వం తీసుకున్న క్రియాశీల సభ్యులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దేవా ఆంజనేయులు, మద్దిలేటి యాదవ్, బ్రహ్మేంద్ర కుమార్, కోటి , బావికాడి గుర్రప్ప, సజ్జల నాగేంద్ర , రమణచారి, చైతన్య, కేశవ, ఇమామ్ ఖాన్, ఆంజనేయులు, రామయ్య, నయమత్ ఖాన్, లోకేష్ గౌడ్, సుధాకర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి : జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను

**విజయవాడ, మే 14 (జనస్వరం) :** ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను పున్నమి ఘాట్ వద్ద శ్రీ దుర్గా భవాని దేవస్థానంలో నిర్వహిస్తున్న త్రయాహ్నిక దీక్షా పూర్వక పునః ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదానం చేసి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కృష్ణా నది తీరంలో అమ్మవారి పేరిట నిర్మించనున్న భారీ దేవస్థానం ఒక శుభ సూచకం. ఈ గుడి ద్వారా ఆధ్యాత్మికత పెరిగి ప్రాంత అభివృద్ధి జరగడం ఖాయం,” అని అన్నారు. దేశ ప్రజలతో పాటు భారతదేశ సైన్యానికి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. గుడి నిర్మాణానికి పార్టీ నాయకుడు ఎస్ ఎన్ మూర్తి లక్ష రూపాయల విరాళం అందించారని, ఇది అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ నాయకులు కొప్పిరెడ్డి సూర్యనారాయణ మూర్తి, స్టాలిన్, బియ్యాజి గన్ను శంకర్, ముద్రబోయిన దేవిక, కురాకుల సురేష్, గంజి పవన్, రాజా నాయుడు, తమ్మిన లీల కరుణాకర్, నామన కార్తీక్ చంద్ర, మారేపల్లి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.






## పుట్టపర్తి పర్యాటక అభివృద్ధికి చేయూత నివ్వండి - కార్పొరేట్ సంస్థలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విజ్ఞప్తి

**పుట్టపర్తి, మే 14 (జనస్వరం) :** పుట్టపర్తిలో పర్యాటక అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యత (CSR) నిధులను వినియోగించాలంటూ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా శిల్పారామం, చిత్రావతి పరివాహక ప్రాంతం, ఆంజనేయ స్వామి విగ్రహం పరిసరాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డి, జాయ్ లూకాస్ జ్యూవెలరీ ప్రతినిధులు జాయ్ లూకాస్, రోబిన్, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్, పర్యాటక అధికారి నర్సయ్య తదితరులు పరిశీలించారు. చిత్రావతి పరివాహక ప్రాంతాన్ని సుందరీకరించి అభివృద్ధి చేయడానికి, అలాగే పుడా పరిధిలోని 14 పార్కులకు మౌలిక వసతులు కల్పించడానికి కార్పొరేట్ సంస్థలు సహకరించాలన్నారు. శిల్పారామంలో పర్యాటకులకు అనుకూలమైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్‌తో అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి, జాయ్ లూకాస్ ప్రతినిధులు భేటీ అయ్యారు. పర్యాటక అభివృద్ధికి తమ సంస్థ పూర్తిగా మద్దతు ఇస్తుందని జాయ్ లూకాస్, రోబిన్ తెలిపారు. సత్యసాయి బాబా ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, డా. పల్లె రఘునాథ్ రెడ్డి, జాయ్ లూకాస్ కంపెనీ ప్రతినిధులను సత్కరించి సత్యసాయి బాబా చిత్రపటాన్ని బహూకరించారు.



# రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం

**- మంత్రి రామానాయుడు**

**- రూ.182.27 లక్షల ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**పాలకొల్లు, మే 14 (జనస్వరం) :** రాష్ట్రంలో రైతాంగానికి మేలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, రైతుల పక్షపాతి ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం మంచి పేరు తెచ్చుకుందని, ఎందుకు ప్రత్యక్షంగా నేడు జరుగుతున్న పనులే నిదర్శనమని, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు అన్నారు. మన రైతు, మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం పోడూరు మండలం అప్పన్న చెరువు గ్రామ పరిధిలో, చర్చికి దగ్గరలో రూ.15 లక్షలతో గగ్గిపర్రు మైనర్ డ్రైన్ పై సి.సి వాల్ నిర్మాణ పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. అనంతరం పెనుమదం గ్రామ పరిధిలో ఎస్. ఆర్. ఆర్. పేట దగ్గరలో కాజ మేజర్ డ్రైన్ పై రూ.11.36 లక్షలతో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, పశువుల ఆసుపత్రి దగ్గరలో రూ.13.27 లక్షలతో పెనుమదం నెం.2 చానెల్ త్రవ్వకం పనులకు, స్థానిక లంక వారి పేట దగ్గరలో చించినాడ చానెల్ పై రూ.82.70 లక్షలతో సి.సి. వాల్ నిర్మాణ పనులకు, మరో రూ.19.94 లక్షలతో చించినాడ చానెల్ త్రవ్వ పనులకు, మేరీమాత గుడి దగ్గరలో చించినాడ చానెల్ పై రూ.40 లక్షలతో వంతెన నిర్మాణ పనులకు కలిపి, మొత్తంగా రూ.182.27 లక్షలతో ఆరు పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి రామానాయుడు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మంత్రికి అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా ప్రజలు



అభిమానంతో పూల వర్షం కురిపించారు. మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. మంత్రి నిమ్మల సారధ్యంలో శరవేగంగా జరుగుతున్న పనుల పట్ల రైతాంగం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గత జగన్ ఐదేళ్ల పాలనలో రైతులకు మేలు జరిగే పనులు జరగకపోగా కాలువల నిర్వహణను గాలికి వదిలేయడంతో తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. నేడు ప్రతి రైతు సంతోషంగా ఆనందంగా ఉన్నారని ప్రజా కూటమి ప్రభుత్వం పట్ల సంతృప్తి వ్యక్తం చేసుకున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. రైతు పక్షపాతిగా చంద్రబాబు నాయుడు మంచి పాలన అందిస్తున్నారని అందుకు మీరంతా భవిష్యత్తులోనూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాబోయే ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, నాయకులు తానేటి బాబురావు, సబ్బితి సుమంగళి, మానేపల్లి శ్రీధర్, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజు, నీటి సంఘం చైర్మన్ పెనుమత్స రామభద్రరాజు, దేవరపు దొరబాబు, కడలి ఆంజనేయులు, గుమ్మాపు జగజ్జీవన్ రావు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి - మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి



**పులివెందుల, మే 14 (జనస్వరం) :** విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 10, లక్షలతో రీ మోడల్ చేసిన ఎస్ఈ కార్యాలయాన్ని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. విద్యుత్ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. విద్యుత్ అధికారులకు ఎటువంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజల నుంచి ఎక్కడ కూడా లో-వోల్టేజ్ సమస్య ఫిర్యాదులు రాకూడదన్నారు. అతి త్వరలో మారుమూల గ్రామాలకు సైతం త్రీఫేస్ కరెంటు అందజేసి ప్రజల జీవనోపాదులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నూతన అన్నమయ్య జిల్లా ఏర్పడిన సందర్భంగా రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో నూతన ఎస్ఇ చాంబర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# ప్రతినిధులను ప్రశ్నిస్తే చంపేస్తారా పల్లా

- గాజువాకలో అరాచక పాలన సాగిస్తున్న పల్లా
- అరాచక శక్తి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు
- నయవంచకుడైన ఎమ్మెల్యే పల్లాపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు దృష్టికి తీసుకెళ్లిన తెలుగుశక్తి
- తెలుగుశక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్

**నర్సీపట్నం, మే 14 (జనస్వరం) :** గాజువాక టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అరాచక శక్తిగా మారిపోయి ప్రజలపై దాడులు చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ ఆరోపించారు. రాష్ట్ర tdp అధ్యక్షుడుగా నియమితులైన నాటి నుండి పల్లా శ్రీనివాస్ నయవంచకునికి ప్రతిరూపంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. బుధవారం నర్సీపట్నంలో ఒక ప్రైవేట్ హోటల్ జరిగిన విలేకరుల సమావేశంలో తెలుగు శక్తి అధ్యక్షుడు బివి. రామ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావుపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. గాజువాక ప్రాంతంలో ప్రభుత్వ, స్టీల్ ప్లాంట్ కి సంబంధించిన ఆస్తులను పల్లా అండ్ కో కబ్జాలకి పాల్పడి కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే పల్లా అక్రమాలపై తాను సీబీఐ ఇతర దర్యాప్తు సంస్థలకి ఫిర్యాదు చేస్తే తనపై పల్లా తన అనుచరులతో దాడి చేయించారని ఆరోపించారు. తనపై జరిగిన దాడిని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన పోలీసులు ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన అక్రమాలపై దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసినందుకు, పల్లా దందాలను ప్రశ్నించినందుకు, తాను ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో పల్లా ఆగడాలని ఆధారాలతో బయటపెట్టగా వాటిని పత్రికల్లో ప్రచురించిన విలేకరులు, ప్రసారమాధ్యమాల్లో ప్రసారం చేసిన కెమెరా జర్నలిస్టులపై దాడులు చేయించారని బి.వి. రామ్ ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే చంపేస్తారా అని ఆయన నిలదీశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస రావు రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సింది పోయి, కబ్జాలు, సెటిల్మెంట్లు, భూదందాలతో బీహార్ రాష్ట్రాని కన్నా ఎక్కువ హింసకు పాటుపడుతూ భయభ్రాంతులకి గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పల్లా శ్రీనివాస రావు టీడీపీ అధ్యక్షునిగా కేవలం రాజధాని అమరావతి, విశాఖపట్నం, విజయవాడ ప్రాంతాలకే పరిమితమయ్యారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనపై విరుచుకుపడిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే పల్లా అకృత్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం, పంచుకోవడం దండుకోవడం, లోబర్చుకోవడం వంటి పంచ సూత్రాలను పల్లా శ్రీనివాసరావు ఆచరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన తాను ఎప్పుడూ పోరాటం చేస్తానని, ప్రజల ఆశీస్సులు కోరుకుంటున్నానని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు అనుచరుడైన మురళి ఎన్నో అరాచకాలు చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# కోమటిగుంట చెరువులో మునిగి ముగ్గురు యువకులు మృతి

**భీమడోలు, మే 14 (జనస్వరం) :** భీమడోలు, పెదవేగి మండలం వేగివాడ గ్రామాల్లో విషాదం చోటు చేసుకుంది. పెదవేగి మండలం వేగివాడకు చెందిన ముగ్గురు యువకులు బుధవారం భీమడోలు గ్రామంలోని చెరువులో మునిగి మృతిచెందిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే—పెదవేగి మండలం వేగివాడకు చెందిన అజయ్, అభిలాష్, సాగర్ అనే యువకులు భీమడోలు మండలం పెదలింగంపాడు గ్రామానికి వెళ్లేందుకు బుధవారం బయలుదేరారు. అక్కడ వారి బంధువుల ఇంట మెచ్యూరిటీ ఫంక్షన్ ఉండడంతో బయలుదేరినట్టు సమాచారం. అయితే మార్గమధ్యలో భీమడోలు పరిధిలోని కోమటిగుంట చెరువులో ఒకరు నీటిలో దిగగా, అతడు మునిగిపోయాడు. అతన్ని రక్షించేందుకు మిగిలిన ఇద్దరూ లోపలికి దిగారు. అయితే త్రాసే క్రమంలో ముగ్గురూ చెరువులోనే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు, మృతుల బంధువులు అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ముగ్గురి మృతదేహాలను చెరువులో నుంచి వెలికి తీశారు. ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# జువ్వల అప్పారావు కుటుంబాన్ని పరామర్శించిన మురళిరాజు

**ప్రత్తిపాడు మే 15 (జనస్వరం) :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో జువ్వల అప్పారావు ఇటీవల కాలంలో హార్ట్ స్టంట్ వేయించుకున్న కారణంగా వారిని ప్రతిపాడు నియోజకవర్గ వైసిపి నాయకులు మురళి కృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బొల్లు నాగేశ్వరరావు జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# గ్రీవెన్స్ ఫిర్యాదుపై విచారణలో అధికారులు పిసిరిమామిడి, పకాబు గ్రామాలకు సందర్శన

**చింతపల్లి మే 14 (జనస్వరం) :** చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పిసిరి మామిడి, కిటుముల పంచాయతీలకు చెందిన అంగన్వాడీ కేంద్రాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించేందుకు శిశు సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా చింతపల్లి, జీకే వీధికి చెందిన ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిలు జి. వెంకటరమణి, ఏ. లక్ష్మీదేవి, అలాగే ఏం. రామలక్ష్మి, ఎస్.కె. గౌహరున్నిషా, పి. అప్పలనర్సమ్మలు విచారణలో పాల్గొన్నారు. విచారణలో పిసిరి మామిడి అంగన్వాడీ ఫిర్యాదుదారురాలు వంతల అప్పలమ్మ అందుబాటులో లేకపోవడంతో ఆమెను మే 15న తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా గ్రామస్థులకు అధికారులు తెలియజేశారు. అనంతరం పకాబు అంగన్వాడీ కేంద్రంలో గ్రామస్థులను సమావేశపరచి వివరాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు రాడా కామేశ్వరరావు మాట్లాడుతూ, ఫిర్యాదుదారులకు మీరు ఎన్నిసార్లు తిరిగినా జాబు రాదు అనే వ్యాఖ్యల నేపథ్యంలో, నియామక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్న అనుమానంతో ఫిర్యాదు చేసినట్టు రాతపూర్వకంగా తెలిపారు. విచారణలో సేకరించిన నివేదికలనుపై అల్లూరి జిల్లా ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు వారు తెలిపారు.



ఈ కార్యక్రమంలో పిసిరి మామిడి, పకాబు గ్రామస్తుల తో పాటు అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నవరంలో రామాలయం ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మురళిరాజు

**ప్రత్తిపాడు, మే 15( జనస్వరం) :** అన్నవరం గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల కమిటీ ఆహ్వానం మేరకు నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ట కార్యక్రమంలో ప్రత్తిపాడు వైసిపి నాయకులు ముదునూరి మురళి కృష్ణంరాజు పాల్గొని రాముల వారి దర్శనం చేసుకునిఆలయ కమిటీ సభ్యులకు10,000 రూపాయలు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష , వైస్ సర్పంచ్ బొబ్బిలి వెంకన్న, తాటిపాక కృష్ణ , పలివెల కొండలరావు ,గంపల జయ గంగరాజు, వీరుల్లా సూరిబాబు, అల్లాడ సూరిబాబు, కొత్త సత్యనారాయణ, సుంకు జగదీష్ ,పదిలం భిన్నబాబు, ఆసీనా శ్రీనివాస్, శ్రీకృష్ణదేవరాయల కమిటీ సభ్యులు,అన్నవరం వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



# మినీ ఆటోనగర్ భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**కోవూరు, మే 14 (జనస్వరం) :** ఇనమడుగు మినీ ఆటోనగర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆటోనగర్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఆమె తెలిపారు. ఇనమడుగు సెంటర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ ఆటోనగర్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెకానిక్ కార్మికులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో లక్కీ డిప్ ద్వారా 65 మంది మెకానిక్, లేత్, వెల్డింగ్ తదితర వృత్తులను చేపడుతున్న కార్మికులకు షాపులు కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కష్టార్జితంగా నిర్మించుకున్న ఈ మినీ ఆటోనగర్ అభివృద్ధికి అన్ని విధాలా అండగా ఉంటా. ఇనమడుగు సెంటర్‌లో 4 లైన్ రోడ్డు విస్తరణ సమయంలో షాపులు కోల్పోయినవారు నిరుత్సాహపడకుండా సమిష్టిగా ముందుకు సాగటం అభినందనీయం" అని అన్నారు. ఇనమడుగు చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులకు ట్రాక్టర్ రిపేర్లు, వ్యవసాయ పరికరాల తయారీ కోసం ఈ ఆటోనగర్ ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. విద్యుత్ అవసరాల కోసం తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఆటోనగర్ అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అంతేకాకుండా, రాజకీయ పార్టీలకు అతీతంగా కోవూరు, కొడవలూరు, విడవలూరు మండల నాయకులు ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమిష్టి శక్తితో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెడ్పీ రాజగోపాల్ రెడ్డి, APSPDCL EE రమేష్ చౌదరి, తహసిల్దార్ నిర్మలానందబాబా, ఎంపీడీవో శ్రీహరి రెడ్డి, కోవూరు టీడీపీ మండల అధ్యక్షుడు ఇంత మల్లా రెడ్డి, టీడీపీ నాయకులు జెట్టి మదన్ రెడ్డి, DCN శ్రీనివాసులు నాయుడు, యాకసిరి వెంకటరమణమ్మ, సూరిశెట్టి శ్రీనివాసులు, బీజేపీ నాయకులు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.





# కర్రెగుట్టలో 31 మంది మావోయిస్టుల హతం

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ తగిలేలా చేశాయి. ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా చేపట్టిన ఆపరేషన్‌లో మొత్తం 31 మంది మావోయిస్టులు మరణించినట్లు సీఆర్పీఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం ప్రకటించారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను బుధవారం బీజాపూర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వెల్లడించారు. సుమారు 21 రోజుల పాటు సాగిన ఈ కీలక ఆపరేషన్‌లో మృతి చెందిన 31 మంది మావోయిస్టులలో 16 మంది మహిళలు ఉన్నారని అధికారులు తెలిపారు. హతమైన మావోయిస్టులపై ప్రభుత్వం గతంలో మొత్తం రూ.1.72 కోట్ల రివార్డును ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ ఎదురుకాల్పులు, ఆపరేషన్ క్రమంలో 18 మంది భద్రతా సిబ్బంది గాయపడినట్లు వెల్లడించారు. మరణించిన మావోయిస్టులలో ఇప్పటివరకు 20 మందిని గుర్తించామని, మరో 11 మందిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. ఘటనా స్థలం నుంచి 35 అత్యాధునిక ఆయుధాలను కూడా భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నట్లు వారు వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదీన ప్రారంభమైన కర్రెగుట్ట ఆపరేషన్ మే 11వ తేదీ వరకు కొనసాగిందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలలో భాగంగా ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం 174 మంది కరడుగట్టిన మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.



# ప్రతి నీటి బొట్టు .. బంగారమే పొదుపుగా వాడుకుందాం

నీటిని పొదుపుగా వాడేవారు ధనాన్ని కూడా పొదుపుగా వాడుతారట! నీటిని దుబారా చేసే వారు డబ్బును కూడా అలానే దుబారా చేస్తారట. ఈ భూమి మీద లభిస్తున్న మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్రజలం. అది ప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచు రూపంలో ఉంది. మిగిలిన ఒక్క శాతంకన్నా తక్కువే ప్రాణులకు పనికివచ్చేది. అదే మంచినీరన్న మాట! ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. అధిక జనాభా తదితర వాస్తవాల వల్ల నీటి వినియోగం పెరిగి చాలీచాలని పరిస్థితి ఒకటైతే, దారుణమైన కాలుష్యం మరొకటి! వాతావరణం కాలుష్యం పెరిగి మంచుమీద ఒత్తిడి మొదలైంది. భూగోళం మీది సమతుల్యానికి మంచు కూడా ఒక ఆధారం. అది కాస్తా కరిగిపోతే, జలప్రళయం సంభవించి నేల తుడిచిపెట్టుకు పోతుంది. నీరే మన జీవనానికి ఆధారం. నదీ పరివాహక ప్రాంతాలలోనే నాగరికత, సంస్కృతీ అభివృద్ధి చెందటం మనకు తెలిసిన విషయమే! నీరు మనకు ఆహారం. నీరే మనకు ఆధారం. రవాణా వ్యవస్థకు కూడా మనం నీటిని వాడుకుంటున్నాం. నీటి కోసం జరుగుతున్న ఉద్యమాలను చూస్తున్నాం. రాబోయే కాలంలో వచ్చేవి 'జలయుద్ధాలే'! ప్రకృతితో ఇకనైనా పరిహాసాలు ఆపేసి, ప్రకృతి వనరులను అతి పవిత్రంగా చూసుకోవటం నేటి మన తక్షణ కర్తవ్యం. అడవులను ఆక్రమించుకుంటున్నాం. స్మశానాలను ఆక్రమించుకుంటున్నాం. చెరువులు ఇతర జలాశయాలను నగరాల్లో ఎప్పుడో ఆక్రమించారు హిరణ్యాక్షుడివర ప్రసాదులు! నిజం చెప్పాలంటే మనమే నీటిని తరిమివేసాం. చాలా నదులు అంతర్ధానం అయిపోయి, అంతర్వాహినులుగా ఉన్నాయి. వాటిలో మన రాష్ట్రంలోని శ్రీ కాళహస్తిలోని సువర్ణముఖి నది ఒకటి.

ఇటువంటి నదులు మనదేశంలో షుమారు 50కి పైగా ఉన్నాయని అంచనా! భూమిలోకి వెళ్ళిపోయిన ఆరావళీ పర్వత ప్రాంతాలలో శుష్కించిపోయిన అయిదు నదులను బతికించిన 'జలబ్రహ్మ' జలభాష, ఘోషను అర్థం చేసుకోగల మహామనీషి, రామన్ మెగసెసే అవార్డ్ గ్రహీత, తరుణ్ భారత్ సంఘ్ అధినేత అయిన శ్రీ రాజేంద్రసింగ్ ను గురించి మనలో ఎంతమందికి తెలుసు? క్షామపీడిత గ్రామసీమలకు నీటిని రప్పించి సస్యశ్యామలం చేసిన జలదాత ఆ మహానుభావుడు! ఆయన స్ఫూర్తితో తెలుగులో 'జలగీతం' అనే 110 పుటల దీర్ఘ కవితను(తెలుగులో వచ్చిన మొదటి దీర్ఘ కవిత ఇదే!) అద్భుతంగా వ్రాసి ఎందరినో ఉత్తేజపరచిన డాక్టర్. యన్. గోపి గారు. మనకు రోజుకి కనీసం 30-50 లీటర్ల పరిశుభ్రమైన, సురక్షితమైన నీరు అవసరం. కానీ ఇప్పటికీ 88. 4 కోట్ల మంది ( 884 మిలియన్ల మంది) ప్రజలకు సురక్షితమైన నీరు అందుబాటులో లేదు. వేసవి వస్తోందంటేనే భయమేస్తోంది. నీటి కొరత దడ పుట్టిస్తుంది. బిందెలతో బారులు తీరే జనాలు కనిపిస్తారు. నీరు లభించని ప్రాంతాలలో ఎదురయ్యే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. భూమి ఏర్పడినప్పుడు ఎంత నీరు ఉందో ఇప్పుడూ అంతే ఉంది. పెరగడం కానీ తరగడం కానీ కాలేదు. కానీ ఆ నీటిని వాడుకునే వారి జనాభా మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది నీటి కోసం కటకటలాడుతున్నారు. ఉన్న మంచినీటిని మనం పొదుపుగా వాడకపోగా కలుషితం కూడా చేస్తున్నాం. ప్రపంచంలో 500కు పైగా మంచినీటి నదులు కలుషితమైపోయాయి. ప్రపంచంలో భారీ యుద్ధాల్లో చనిపోయిన వారి కన్నా, కలుషిత నీటి వల్ల మరణించిన వారే ఎక్కువ. ఏడాదికి 40 లక్షల మంది కలుషిత నీరు తాగి చనిపోతున్నారు. ఒక కిలో బియ్యాన్ని పండించడానికి 5000 లీటర్ల నీరు అవసరమవుతుంది. అరకిలో కాఫీ తయారవడానికి 11, 000 లీటర్ల నీరు అవసరం. కార్పొరేట్ కంపెనీలు ఆరోగ్యానికి హాని కలిగించే శీతల పానీయాల కోసం వృధా చేస్తున్న మంచి నీటికి ఇక లెక్కే లేదు. కొన్ని రాష్ట్రాలు ఈ శీతల పానీయాలను నిషేధించాలని కూడా చూస్తున్నాయి. ప్రపంచ జనాభాలో భారత్ జనాభా 16 శాతంగా ఉంది. కానీ ప్రపంచ నీటి వనరుల్లో భారత నీటి వనరులు కేవలం నాలుగు శాతంగానే ఉన్నాయి. ప్రస్తుతమున్న వెయ్యి మిలియన్ల జనాభాకు తలసరి నీటి లభ్యత సంవత్సరానికి ఒక్కో వ్యక్తికి 1. 170 క్యూబిక్ మీటర్లుగా ఉంది. తీవ్రంగా ఉన్న నీటికొరత అవసరాలకు వాడుకునే వారి మధ్య ఘర్షణలకు దారి తీస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సమీప భవిష్యత్తులో నీటి యుద్ధాలు ఖాయమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. మన దేశంలో మాత్రం ఇప్పటికే నదీ జల వివాదాలు తలెత్తుతున్నాయి. జల వివాదాలకు పెరుగుతున్న నీటి వినియోగమే ప్రధాన కారణం. వర్షాలు తగ్గడం, నదీ ప్రవాహంలో తేడా, అనుమతులు లేకుండా డ్యామ్ల నిర్మాణానికి ప్రయత్నించడం మరి కొన్ని కారణాలు. 2050 నాటికి బ్రహ్మపుత్ర, బారక్, తపతి నుంచి కన్యాకుమారి వరకు పశ్చిమ దిశలోకి ప్రవహించే నదుల్లో మాత్రమే తగినంత నీరు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నీటి విలువను తెలిపే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ను మరో మహామనీషి, మన మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాంగారు తయారు చేసి ఎప్పుడో ప్రజెంట్ చేసారు.కానీ మనమే పట్టించుకోలేదు. వాటిని పట్టించుకోలేదు. భారతదేశ చరిత్రలో మునుపెన్నడూ లేనంతటి తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దేశంలో సుమారు 60 కోట్ల మందిని తాగునీటి కొరత తీవ్రంగా పీడిస్తోంది. ఇది ఇక్కడితో ఆగిపోలేదని, మున్ముందు సమస్య మరింత తీవ్రం కానుందని నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని 24 రాష్ట్రాల్లో పరిశీలన జరిపి నీతి ఆయోగ్ ఈ విషయం వెల్లడించింది. అంతేకాదు.. 21 నగరాలు తాగునీటి విషయంలో పెను ప్రమాదం అంచున ఉన్నాయని హెచ్చరించింది. ఆయా నగరాల్లో తాగునీటి అవసరాలు రోజురోజుకీ పెరుగుతుండగా అక్కడి భూగర్భ జలాలు మాత్రం అంతకంటే వేగంగా అడుగంటుతున్నాయని తేల్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ 21 నగరాల్లో 2020 నాటికి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతాయని హెచ్చరించింది. నీటి ఎద్దడి ప్రభావం వల్ల ఆహార భద్రతకు ముప్పు కలగొచ్చని నీతి ఆయోగ్ చెప్పింది.

దేశంలో వినియోగమయ్యే నీటిలో 80 శాతం వ్యవసాయానికే ఉపయోగిస్తుండడంతో నీటి కొరత ప్రభావం ఆహార ఉత్పత్తులపైనా పడనుంది. దేశంలోని అనేక నగరాలు, పట్టణాలు ఏటా వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటాయి. ఇంటింటికీ తాగునీటి సరఫరా చేసేలా సువ్యవస్థీకృతమైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు.వేసవి వచ్చిందంటే పబ్లిక్ కుళాయిలు, వీధుల్లోకి వచ్చే నీళ్ల ట్యాంకర్ల వద్ద బిందెలతో బారులు తీరడం సర్వసాధారణమైపోయింది. ప్రభుత్వం అరకొరగా సరఫరా చేసే నీరు చాలక ప్రయివేటు ట్యాంకర్లనూ ఆశ్రయిస్తుంటారు. ఇక గ్రామాల్లో అయితే స్వచ్ఛమైన తాగునీరు దొరక్క ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోందని.. దేశవ్యాప్తంగా ఏటా 2 లక్షల మంది అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల రోగాలకు గురై మరణిస్తున్నారని ఈ నివేదిక వెల్లడించింది. మరోవైపు పట్టణాలు, నగరాలు విస్తరిస్తుండడంతో పట్టణాల్లోని జలవనరులపై మరింత భారం పెరుగుతోంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2030 నాటికి దేశంలో తాగునీటి సరఫరా కంటే అవసరం రెండింతలు ఉంటుందని అంచనా. అంతేకాదు... నీటి కొరత కారణంగా దేశ స్థూల దేశీయోత్పత్తిలో 6 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని అంచనా వేసింది. అయితే, జలయాజమాన్యం విషయంలో కొన్ని రాష్ట్రాలు మిగతా రాష్ట్రాల కంటే మెరుగైన స్థితిలో ఉన్నాయి. నీతి ఆయోగ్ జలయాజమాన్య సూచిలో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలవగా.. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అధ్యయనం చేసిన 24 రాష్ట్రాల్లో 15 గత ఏడాది కంటే కొంత ప్రగతి సాధించాయి. మరోవైపు జలయాజమాన్యం విషయంలో అట్టడుగున ఉన్న ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా, బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోనే దేశ జనాభాలో సుమారు సగం మంది నివసిస్తుండడం ఆందోళనకర అంశం. అంతేకాదు.. వ్యవసాయ ఉత్పాదకతా ఈ రాష్ట్రాల్లోనే ఎక్కువ. ఇలాంటి రాష్ట్రాలు జలయాజమాన్యంలో వెనుకబడడంపై నీతి ఆయోగ్ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది.జల వినియోగం, యాజమాన్యం విషయంలో కుటుంబాలు, పరిశ్రమలకు సంబంధించిన కచ్చితమైన సమాచారం అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వాలు ఈ పరిస్థితిని చక్కదిద్దడంలో ఇబ్బంది పడుతున్నాయని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది.

